



నారాయణ తిరుమలలో వేంకటేశ్వరస్వామిని దర్శించుకుంటున్న భక్తులు



కలెక్టర్ శ్రీకేష్ బాలాజీ లఠ్కర్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తున్న ఎస్పీ రాధిక

హ్యాపీ న్యూ ఇయర్

- జిల్లాలో కొత్త సంవత్సర వేడుకల సందడి

శ్రీకాకుళం కల్చరల్/ కలెక్టరేట్/ టెక్కలి/ కోటబొమ్మాళి, జనవరి 1 : కొత్త సంవత్సరానికి జిల్లావాసులు ఘన స్వాగతం పలికారు. చిన్నారుల నుంచి పెద్దల వరకు సంబరాలు చేసుకున్నారు. నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా సోమవారం అధికారులు, ప్రజాప్రతినిధులకు శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. పలువురు పూలబొకేలు, స్వీట్లు, పండ్లు తీసుకెళ్లి.. శుభాకాంక్షలు తెలిపారు. కోటబొమ్మాళి మండలం నిమ్మాడలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు, ఎంపీ రామ్మోహన్ నాయుడు కొత్త సంవత్సరం వేడుకలు చేసుకున్నారు. వారికి పెద్ద ఎత్తున పార్టీశ్రేణులు, అభిమానులు శుభాకాంక్షలు తెలిపారు.

- కలెక్టర్ శ్రీకేష్ బాలాజీలఠ్కర్‌ను ఎస్పీ రాధిక, డీఎంహెచ్‌వో మీనాక్షి, జడ్పీ సీఈవో వెంకట్రామన్, డ్వామా పీడీ చిట్టిరాజు, డీఆర్డీవో పీడీ విద్యాసాగర్, డీఈవో వెంకటేశ్వరరావు, ఆర్డీవో రంగయ్య, తహసీల్దార్ వెంకటరావు, డీపీవో రవికుమార్, డీపీఆర్వో సూర్యచంద్రరావు తదితర అధికారులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

- అలాగే ఆలయాలకు భక్తులు పోటెత్తారు. కొత్త సంవత్సరంలో ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకుంటూ పూజలు చేశారు. శ్రీకాకుళంలోని నారాయణ తిరుమల ఆలయంలో వేంకటేశ్వర స్వామిని ప్రత్యేకంగా అలంకరించగా.. అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. విజయగణపతి ఆలయంలో పూజలు చేశారు. సత్యసాయి మందిరంలో భజనలు, కీర్తనలు ఆలపించారు.



నిమ్మాడలో అచ్చెన్నాయుడు, రామ్మోహన్‌నాయుడుకు శుభాకాంక్షలు..



ఏంటనుకున్నావ్.. సీఎంవో ఆదేశాలున్నాయ్!

- ఇసుక రీచ్‌ల్లో వైసీపీ ఆఫీసు కీలక ఉద్యోగి హల్‌చల్
- పైనుంచి పరిశీలించమన్నారంటూ కలరింగ్
- పశ్చిమ గోదావరి నుంచి వచ్చి ఇక్కడ పెత్తనం
- సొంత మనుషులను నియమించుకుని అక్రమాలు
- అధికార పార్టీ ఎమ్మెల్యేల మాట కూడా బేఖాతర్

(ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం)

వైసీపీ కార్యాలయం కీలక ఉద్యోగి ఇసుక రీచ్‌ల్లో దందాలకే రా'రాజు'గా మారిపోయారు. ఎవరైనా ప్రశ్నిస్తే.. నేరుగా సీఎం కార్యాలయం నుంచి పరిశీలించమన్నారని చెబుతుండడంతో అధికార పార్టీ నాయకులు సైతం హడలెత్తిపోతున్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత జిల్లాలో ఇసుక దందా యథేచ్ఛగా సాగుతోంది. రీచ్‌ల వద్ద ప్రైవేటు వ్యక్తుల హవా ఎక్కువవుతోంది. పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన వ్యక్తి.. శ్రీకాకుళం వైసీపీ కార్యాలయంలో కీలక ఉద్యోగిగా పని చేస్తున్నారు. కార్యాలయంలో పనులు చక్కబెట్టాల్సిన ఆయన.. ప్రవృత్తిగా ఇసుక రీచ్‌ల్లో పెత్తనం సాగిస్తున్నాడనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇసుక రీచ్‌ల్లో స్థానిక గ్రామస్థులు, యువకులను కాకుండా.. పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన వారిని నియమించి.. వారి వద్ద భారీగా వసూళ్లు చేసినట్టు సమాచారం. సొంత మనుషులను నియమించుకుని.. వారి ద్వారా దందా చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇది వరకు జేపీ సంస్థ ద్వారా జిల్లాలో ఇసుక తవ్వకాలు నిర్వహించేవారు. అక్రమాలను అరికట్ట లేకపోయినా.. స్థానికులకు రీచ్‌ల వద్ద కొంతమేర అవకాశముండేది. ఇప్పుడు జిల్లాలో ఇసుక తవ్వకాలను ప్రతిమ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ కంపెనీ నిర్వహిస్తోంది. ఆ సంస్థ తరపున జిల్లాకు మేనేజర్‌గా ఓ వ్యక్తి పని చేస్తున్నారు. ఆ వ్యక్తి కూడా తాను పర్యవేక్షించాల్సిన బాధ్యతలను సైతం వైసీపీ కార్యాలయ ఉద్యోగి చేతిలో పెట్టినట్లు తెలుస్తోంది. దీంతో వైసీపీ కార్యాలయ ఉద్యోగి దందాకు అడ్డూఅదుపు లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఒక్కో రీచ్ నుంచి రోజుకు రూ.10వేల వరకు వసూలు చేస్తున్నారు. రీచ్‌లతో ఆయనకు సంబంధం లేకపోయినా.. కారులో అక్కడకెళ్లి హడావుడి చేస్తారు. సీఎంవో నుంచి ర్యాంపులను పర్యవేక్షించాలని తనకు ఆదేశాలు వచ్చాయని కలరింగ్ ఇవ్వడం అధికారపార్టీ వర్గాల్లో సైతం చర్చనీయాంశమవుతోంది. అక్రమార్జనతో విలాస జీవితానికి అలవాటు పడినట్లుగా తొలి నుంచీ గమనిస్తున్నవారు చెబుతున్నారు. మరో జిల్లా నుంచి వచ్చి.. వైసీపీ కార్యాలయంలో పనిచేస్తూ.. ఇసుక రీచ్‌ల వద్ద పెత్తనం చేయడంతో స్థానిక అధికార పార్టీ నేతలు గుర్రుగా ఉన్నారు. ఎమ్మెల్యేల మాట సైతం బేఖాతరు చేయడంతో వారు సైతం సదరు ఉద్యోగి తీరుపై అసంతృప్తి చెందుతున్నారు. ఈ నేపథ్యంలో అధికారపార్టీ నేతలు కొందరు.. ఇసుక అక్రమాలకు పాల్పడుతున్న ఉద్యోగి బాగోతాన్ని పరోక్షంగా బయటపెట్టారు. వైసీపీ పెద్దలు దృష్టి సారించి.. ఆయన అక్రమాలకు అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు. మరోవైపు ఈ ఉద్యోగి వల్ల రీచ్‌ల్లో స్థానికులకు ఉపాధి లభించడం లేదని, ఆయనపై చర్యలు తీసుకోవాలంటూ ఆయా గ్రామస్థులు విజ్ఞప్తి చేస్తున్నారు. దీనిపై నేతలు ఎలా స్పందిస్తారో వేచి చూడాలి.

> ఆయన వైసీపీ కార్యాలయం ఉద్యోగి. చేసేది మాత్రం ఇసుక దందా. కారులో రీచ్‌ల వద్దకు వెళ్తాడు. సీఎంవో నుంచి ఆదేశాలున్నాయంటూ హల్‌చల్ చేస్తాడు. అక్కడున్న వారిని బెదరగొడతాడు. తన వాటా ఇవ్వాల్సిందే నంటాడు. ఒక్కో రీచ్ నుంచి రూ.10వేలు వసూలు చేస్తాడు. ఇందుకోసం సొంత మనుషులను సైతం పెట్టుకున్నాడు. ఇతని వ్యవహారం అధికారపార్టీ నాయకులకు సైతం మింగుడు పడడం లేదు.

ఆగని పోరాటం

- వినూత్నంగా అంగన్‌వాడీల ఆటా-పాట
- మోకాళ్లపై సమగ్ర శిక్ష ఉద్యోగుల నిరసన
- కొనసాగిన మునిసిపల్ కార్మికుల ఆందోళన



ఆటాపాటలతో అంగన్‌వాడీల నిరసన

అరసవల్లి, జనవరి 1: నూతన సంవత్సరం ప్రారంభం రోజు కూడా.. వారి పోరాటం ఆపలేదు. సమస్యల పరిష్కారం కోరుతూ.. ఓ వైపు అంగన్‌వాడీలు ఆటా-పాటలతో వినూత్న నిరసన తెలిపారు. మరోవైపు సమగ్ర శిక్ష ఉద్యోగులు మోకాళ్లపై కూర్చొని ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఇంకోవైపు మునిసిపల్ కార్మి కులు ఆందోళన కొనసాగించారు. శ్రీకాకుళంలోని అర్బన్ ఐసీడీఎస్ కార్యాలయం వద్ద సమ్మె చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు.. సోమవారం ఆట పాటలతో, థింసా నృత్యం చేసి.. ప్రభుత్వంపై నిరసన తెలిపారు. యూనియన్ అధ్యక్షురాలు కె.కల్యాణి మాట్లాడుతూ.. చర్చలకు పిలిచి ఆర్థిక విషయాలపై మాట్లాడవద్దని చెప్పడం, చివరకు చర్చలు విఫలమవడం నిత్యకృత్యమైపోయిందన్నారు. ఎన్నికల హామీలను గుర్తు చేసుకోవాలని సూచించారు. కనీస వేతనం అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాజేశ్వరి, ప్రమీలాదేవి, లతాదేవి, కాంచన, సుజాత, శాంతామణి, మాధురి, లక్ష్మి, హేమ, సరోజిని, భాగ్యలక్ష్మి, జ్యోతి, రాణి, ఎమ్ శారద, జ్యోతిలక్ష్మి, భూలక్ష్మి పాల్గొన్నారు.

- కలెక్టరేట్ వద్ద సమగ్ర శిక్ష ఉద్యోగుల శిబిరాన్ని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దవళ సరస్వతి సోమవారం సందర్శించారు. సమగ్ర శిక్ష కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని ఆమె డిమాండ్ చేశారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిషోర్ కుమార్ మాట్లాడుతూ.. సమగ్ర శిక్ష ఉద్యోగులకు ప్రతినెలా 1న జీతాలు చెల్లించాలని, ఎంటీఎస్ కల్పించాలని, సామాజిక భద్రతా పథకాలు వర్తింప జేయాలని కోరారు. కార్యక్రమంలో సమగ్రశిక్ష జేఏసీ జిల్లా అధ్యక్షుడు పి.మురళీకృష్ణ, యూటీఎఫ్ కార్యవర్గ సభ్యుడు పురుషోత్తం, జనరల్ సెక్రటరీ బి.శ్రీరామ్మూర్తి, ఏపీటీఎఫ్ ధర్మారావు, ఢిల్లీశ్వరరావు, అనిల్‌కుమార్, రామారావు, వేంకటేశ్వరరావు, తవిటినాయుడు, శ్రీనివాసరావు, చిన్నారావు, రోహిణి, రామినాయుడు, అచ్యుతరావు పాల్గొన్నారు.



శ్రీకాకుళంలో ఆందోళన చేస్తున్న మునిసిపల్ కార్మికులు

- శ్రీకాకుళం కార్పొరేషన్ కార్యాలయం వద్ద మునిసిపల్ కార్మికులు నిరవధిక సమ్మె కొనసాగిస్తూ.. న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు ఏ.గణేష్ మాట్లాడుతూ హామీలు అమలు చేయాలని కోరుతున్నా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం దారుణమన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఎన్.బలరాం, జనార్దనరావు, యుగంధర్, ఆర్జి రాము, గణేష్ పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద మోకాళ్లపై సమగ్రశిక్ష ఉద్యోగుల నిరసన



ఐజీగా బాధ్యతలు స్వీకరిస్తున్న హరికృష్ణ

విశాఖ రేంజ్ ఐజీగా హరికృష్ణ

శ్రీకాకుళం క్రైం, జనవరి 1: ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీసుగా పదోన్నతి పొందిన ఎస్.హరికృష్ణ సోమవారం విశాఖ రేంజ్ ఐజీగా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కార్యాలయ సిబ్బందితో కలిసి నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొని కేక్‌కట్ చేశారు. రేంజ్ పరిధిలోని అధికారులు ఐజీని కలిసి న్యూఇయర్ శుభాకాంక్షలు తెలిపారు.

ఎస్పీ రాధికకు గ్రేడ్ లెవెల్..

ఎస్పీ జీఆర్ రాధికకు జూనియర్ అడ్మినిస్ట్రేటివ్ గ్రేడ్ లెవెల్ 12పే మ్యాట్రిక్ స్కేల్ కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రవ్యాప్తంగా 2011, 2013, 2014, 2015 సంవత్సరాల ఐపీఎస్ బ్యాచ్‌లకు చెందిన 18మంది ఎస్పీలకు ఈ పదోన్నతులు కల్పించింది. ఇందులో భాగంగా 2014 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన ఎస్పీ రాధికకు స్థానం దక్కింది. త్వరలో ఆమె సీనియర్ ఎస్పీగా పదోన్నతి పొందనున్నారు. ఈ సందర్భంగా పలువురు పోలీసు అధికారులు ఎస్పీకి అభినందనలు తెలియజేశారు.

కొత్త సంవత్సరం వేళ అపశ్రుతి

- బారువ బీచ్‌లో గల్లంతై వ్యక్తి మృతి



అజిత్ (ఫైల్)

సోంపేట, జనవరి 1: కొత్త సంవత్సరం వేళ.. ఆ ఇంట విషాదం నెలకొంది. నూతన సంవత్సరం వేడుకలను పురస్కరించుకుని.. సరదాగా సముద్ర స్నానానికి వెళ్లిన ఓ వ్యక్తిని కెరటాల రూపంలో మృత్యువు కబళించింది. వివరాల్లోకి వెళితే.. మామిడిపల్లికి చెందిన మర్రి అజిత్‌కుమార్ (50) బారువ బీచ్‌లో గల్లంతై.. మృతి చెందాడు. సోమవారం సముద్రంలో ఆయన స్నానం చేస్తుండగా కెరటాల ఉధృతికి కొట్టుకుపోయాడు. కొద్దిసేపటి తర్వాత గొల్లగండి తీరం వద్దకు విగతజీవిగా కొట్టుకువచ్చాడు. దీంతో కుటుంబ సభ్యులు బోరున విలపించారు. తీరంలో ఉన్నవారంతా దిగ్భ్రాంతి చెందారు. అజిత్‌కుమార్ ప్రైవేటు బ్యాంకులో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగంతో పాటు ఎల్ఐసీ ఏజెంట్‌గా పని చేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. కుమారుడు అంకిత్ బీటెక్, కుమార్తె శృతి ఇంటర్ చదువుతున్నారు. ఇంటి పెద్ద దిక్కును కోల్పోవడంతో కుటుంబ సభ్యులు విషాదంలో మునిగిపోయారు.

'నయా' జోష్

- ఘనంగా నూతన సంవత్సరానికి స్వాగతం
- నేతలు, అధికారులకు శుభాకాంక్షల వెల్లువ



కోటబొమ్మాళి: అచ్చెన్నాయుడు, రామ్మోహన్‌లకు శుభాకాంక్షలు తెలిపేందుకు తరలివచ్చిన జనం



పోలాకి: మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తికి కేక్ తినిపిస్తున్న నేతలు

నూతన ఆంగ్ల సంవత్సరం సందర్భంగా ఆదివారం అర్ధరాత్రి నుంచి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కేక్‌లు కట్ చేయడంతో పాటు ఆట పాటలతో సందడిగా గడిపారు. సోమవారం ఉదయం నుంచి తమ అభిమాన నేతలు, అధికారులకు శుభాకాంక్షలు తెలిపేందుకు వారి ఇళ్లకు, కార్యాలయాలకు తరలివచ్చారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు, ఎంపీ రామ్మోహన్ నాయుడు స్వగ్రామం నిమ్మాడకు టీడీపీ క్యాడర్, అభిమానులు, అధికారులు తరలిరావడంతో జనసంద్రమైంది. జిల్లా వ్యాప్తంగా ఆపార్టీ నేతలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. దీంతో నిమ్మాడ వెళ్లే మార్గంలో వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. అలాగే వివిధ పార్టీల నేతలకు వారి అభిమానులు ఆయా స్వగ్రామాల్లో నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. పలాస టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీషకు, మాజీ మంత్రి శివాజీ, విజయలక్ష్మి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు కిమిడి కళావెంకటరావు, రామ్ మల్లిక్‌నాయుడు, మాజీ ఎమ్మెల్యేలు గుండ లక్ష్మీదేవి, గుండ అప్పలసూర్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణకు నేతలు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్‌ల స్వగ్రామం పోలాకి మండలం మబుగాంకు అభిమానులు పెద్దఎత్తున తరలివచ్చారు. అలాగే వివిధ పార్టీల నేతలకు, జిల్లా అధికారులకు శుభాకాంక్షలు తెలిపారు.

● పలాస పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు దువ్వాడ శ్రీధర్‌కు అభిమానులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. దువ్వాడ వారికి అల్పాహారంతో పాటు క్యాలెండర్లను అందించారు.

● పాతపట్నం నియోజకవర్గ టీడీపీ నాయకుడు, సామాజిక వేత్త మామిడి గోవిందరావు (ఎంజీఆర్) నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. -ఆంధ్రజ్యోతి బృందం







కవిటి: ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్, ఆమదాలవలస: టీడీపీ జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్, జి.సిగడాం: మాజీ మంత్రి కళావెంకటరావు, పాతపట్నం: మాజీ ఎమ్మెల్యే కలమట రమణ మూర్తి, పలాస: గౌతు శిరీష, శివాజీలకు శుభాకాంక్షలు తెలుపుతున్న టీడీపీ నేతలు



అరసవల్లి: అభిమానులకు, కార్యకర్తలు కృతజ్ఞతలు తెలుపుతున్న గుండ దంపతులు



జి.సిగడాం: ఎన్‌ఈఆర్‌కి శుభాకాంక్షలు తెలుపుతున్న మండల బీజేపీ నాయకులు



శ్రీకాకుళం డీఎంహెచ్‌వో డా.బొడ్డేపల్లి మీనాక్షికి శుభాకాంక్షలు తెలుపుతున్న ఉద్యోగులు



పలాస: దువ్వాడ శ్రీధర్‌కు శుభాకాంక్షలు చెబుతున్న ఆర్టీసీ కార్మికసంఘ నాయకులు



పాతపట్నం: ఎంజీఆర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న పార్టీ నేతలు, అభిమానులు



పలాసరూరల్: దానగొర చర్చిలో ప్రార్థనలు



టెక్కలి: డీసీసీ అధ్యక్షుడు పేడాడ పరమేశ్వరరావుకు క్యాడర్ అభినందన



అరసవల్లి: సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడు గొండు శంకర్‌కు అభిమానుల శుభాకాంక్షలు



హిరమండలం: జడ్పీటీసీ బుచ్చిబాబుకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎంపీడీవో తదితరులు

ప్రయాణ పాట్లు



మెట్లు ఎక్కుతున్న ప్రయాణికులు

నందిగాం: ఇతర ప్రాంతాలకు వెళ్లాలంటే మెట్లు ఎక్కాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. పెద తామరాపల్లి హైవే వద్ద సర్వీస్‌రోడ్డు ఏర్పాటు చేసినప్పటికీ అండర్‌పాసేజ్ కారణంగా సర్వీస్ రోడ్డు నుంచి బస్సులు రాకపోవడంతో మెట్లు ఎక్కి పైకి హైవేకి వెళ్లి అటు పలాస, ఇటు శ్రీకాకుళం, విశాఖ ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. దీంతో వృద్ధులు, గర్భిణులు ఇబ్బందులకు గురవుతున్నారు. సర్వీస్ రహదారి వంతెనకు ఇరువైపులా ఏర్పాటు చేసినందున బస్సులు సర్వీస్ రహదారి నుంచి వచ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలని మండల సమావేశంలో తీర్మానించినా ఫలితం లేకపోయిందని స్థానిక ప్రజా ప్రతినిధులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సర్వీస్ రోడ్డు నుంచి బస్సులు వచ్చేలా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

'పార్టీ' కార్యాలయం..!



పాత పంచాయతీ కార్యాలయంలో మద్యం సేవిస్తున్న దృశ్యం

చిత్రంలో చూస్తున్నారుగా.. దర్జాగా టేబుల్‌పై మందు బాటిళ్లు పెట్టుకుని ఎలా సేవిస్తున్నారో.. అయితే ఇది బార్ అంటే పప్పులో కాలేసినట్లే.. ఇది పంచాయతీ కార్యాలయం.. రట్టిణి పంచాయతీకి సంబంధించిన సచివాలయం వసుం దరకు తరలించడంతో ఈ భవనం ఖాళీగా ఉంది.. అంతే స్థానిక అధికార పార్టీ నేతలు, వలంటీర్లతో కలిసి డిసెంబరు 31న కొత్త సంవత్సర వేడుకలను ఇలా జరుపుకున్నారు. దీంతో స్థానికుల నుంచి తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ ఘటనపై ఎంపీడీవో చంద్రకుమారిని వివరణ కోరగా ఈ విషయం తన దృష్టికి రాలేదని, పరిశీలించి నివేదిక ఇవ్వాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశిస్తున్నామన్నారు. తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. -మెళియాపుట్టి

ఆలయాల్లో ప్రత్యేక పూజలు



నరసన్నపేట: కొత్త సంవత్సరం ఆరంభం రోజున సోమవారం ఆలయాలకు భక్తులు పోటెత్తారు. పట్టణంలో ఉమా నీలకంఠశ్వర స్వామి, ఉమా మహేశ్వరస్వామి, సోమేశ్వర స్వామి, వెంకటేశ్వర స్వామి, సత్యన్నారాయణ స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ధనుర్మాసం సందర్భంగా గీతామందిరంలో గోదా రంగనాథులను ప్రత్యేకంగా అలకరించి పూజలు చేశారు. తిరుప్పావై 16వ పాశుర విన్నపం చేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకుడు పీసపాటి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

రేపు ఉపాధ్యాయుల సమస్యలపై ధర్నా

టెక్కలి: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం బుధవారం జిల్లా కేంద్రంలో ధర్నా నిర్వహిస్తున్నట్లు యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు కె.దాలయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్యోగులకు ఒకటో తేదీన జీతాలు, పెండింగ్ బకాయిలపై ప్రభుత్వంతో అమీతుమీ తేల్చుకునేందుకు ఈ ధర్నా చేపడుతున్నామన్నారు. అప్పటికీ ప్రభుత్వం స్పందించకుంటే 9, 10 తేదీల్లో విజయవాడలో 36 గంటల రాష్ట్రస్థాయి ధర్నా నిర్వహి స్తామన్నారు. వైసీపీ ప్రభు త్వంలో ఉద్యోగులకు ఏనాడూ ఒకటో తేదీన జీతాలు రాలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు సైతం అమలు చేయలేదన్నారు.

రానున్న ఎన్నికల్లో సత్తాచూపుతాం

- కవిటిలో బెంతు ఒరియా కులస్థుల ర్యాలీ, నిరసన



సంఘీభావం తెలుపుతున్న జనసేన నేత దాసరి రాజు

కవిటి : కుల గుర్తింపు కల్పించకుంటే రానున్న ఎన్నికల్లో తమ సత్తా చూపుతామని బెంతుఒరియా కులస్థులు తెలిపారు. కవిటిలో ఆ కులస్థులు చేపట్టిన నిరాహార దీక్షలో ఐదోరోజు సోమవారం ర్యాలీ, నిరసన చేపట్టారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో మాయమాటలు చెప్పి ఓట్లు పొందే సంస్కృతికి ముగింపు పలుకుదామన్నారు. కులధ్రువీకరణ పత్రం ఇవ్వకపోగా, ఇటీవల సీజీసీ సభ్యునితో కూడిన నివాస ధ్రువపత్రాన్ని నిలుపుదలచేయడం తగదన్నారు. ఈ మేరకు కవిటిలో మహిళలు, యువకులతో కలిసి అధికారులు, నాయకులకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ర్యాలీ చేపట్టారు. అనంతరం మూడు రోడ్ల కూడలిలోని అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి వినతిపత్రం అందించారు. బెంతుల నిరసనకు జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి రాజు మద్దతు తెలిపారు. ఆయన దీక్షాశిబిరంలో కూర్చొన్నారు.

టీడీపీ ఫ్లెక్సీల కాల్చివేత



పలాసరూరల్: పలాస మండలం లొద్దభద్ర, మాకన్నపల్లి గ్రామాల్లో సోమవారం టీడీపీ ఫ్లెక్సీలను గుర్తు తెలియని వ్యక్తులు కాల్చివేశారు. లొద్దభద్ర గ్రామంలో నూతన సంవత్సర వేడుకల సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను కాల్చి వేయగా, మాకన్నపల్లిలో చింపివేశారు. దీనిపై ఆయా గ్రామాలకు చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేశారు.

ఇంటింటా రామయ్య అక్షింతలు

ఇచ్ఛాపురం రూరల్: శాసనంలో రామనామ కీర్తనలు మధ్య ఇంటింటా అయోధ్య రామయ్య అక్షింతలను పంపిణీచేశారు. తొలుత సోమవారం టి.బరంపురం రామాలయంలో అక్షింతలకు ప్రత్యేక పూ జలు నిర్వహించి అనంతరం మేళతాళాలతో గ్రామంలో ఊరే గించి ప్రతి ఇంటికి అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కారంగి మోహ నరావు, సర్పంచ్ కారంగి త్రినాథ్, తిప్పన ధనుంజయం పాల్గొన్నారు. ● **గార:** అయోధ్యలో ఈ నెల 22న రామాలయ ప్రారంభోత్సవం నేపథ్యంలో సోమవారం చల్లపేట గ్రామంలో స్వామివారి అక్షింతలు ఊరేగింపు చేపట్టి, ఇంటింటికి పంపిణీ చేశారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ జిల్లా కార్యదర్శి శ్రీరంగం మధుసూదనరావు, వీహెచ్‌పీ కార్యకర్తలు, భవానీ భక్తులు పాల్గొన్నారు. ● **వజ్రపుకొత్తూరు:** వజ్రపుకొత్తూరు విశ్వేశ్వర ఆలయంలో సోమవారం అయోధ్య నుంచి తీసుకువచ్చిన అక్షింత లను భక్తులకు పంపిణీ చేశారు. రామమందిరం పూర్తి చేసి ఈనెల 22న భక్తులను దర్శనం నిర్వహించనున్న తరుణంలో ఈ అక్షింతలను గ్రామాల్లో భక్తులకు అందిస్తు న్నారు. కార్యక్రమంలో ఎస్‌పి శ్రీనివాస్, డి.ఉమామ హేశ్వర్రావు, రమేష్ బెహరా తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలంలో విద్యార్థుల నృత్య ప్రదర్శన

ఇచ్ఛాపురం: శ్రీశైలంలో స్వేచ్ఛా నృత్య తరంగణి విద్యా ర్థుల నృత్య ప్రదర్శన అలరించిందని నృత్య తరంగణి అకాడమీ అధ్యక్షుడు గోవింద్ తెలిపారు. ఆదివారం రాత్రి చిన్నారులు కూచిపూడి, భరతనాట్యం, జానపద నృత్యాలు ప్రదర్శించారు. ఈ మేరకు దేవస్థానం అధికారులు జి.రావి, వి.గణేష్ ప్రశంసా పత్రాలతోపాటు మెమెంటోలు అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలంటూ ఎస్ఎఫ్ఐ నిరసన



నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ ప్రతినిధులు

టెక్కలి రూరల్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో సోమవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కళాశాల నాయకులు, విద్యార్థులు భైఠాయించి నిరసన తెలిపారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు యు.దుర్గాప్రసాద్, జిల్లా కార్యదర్శి బి.హరీష్ మాట్లాడుతూ.. డిగ్రీ కళాశాలల్లో స్పెషల్ ఫీజుల పేరుతో పేద విద్యార్థులపై భారం మోపు తున్నారని, విద్యార్థులు జగనన్న విద్యా దీవెన పడకుండానే విద్యా ఓఎస్ యాప్ ద్వారా చెల్లింపులు చేపట్టాలని కళాశాల యాజమాన్యాలు ఒత్తిడి తీసుకువస్తున్నాయని ఆరోపించారు. లైబ్రరీ, ట్యూషన్, స్పోర్ట్స్, ఇతర ఈవెంట్ల పేరుతో స్పెషల్ ఫీజుల వసూళ్లను తక్షణం నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ప్రిన్సిపాల్ డా.టి.గోవిందమ్మకు వినతిపత్రం అందించారు.

టీడీపీతోనే రాష్ట్ర భవిష్యత్తు



టీడీపీ ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న నాయకులు

వజ్రపుకొత్తూరు: వైసీపీ పాలనలో రాష్ట్రం అధోగతి పాలైందని, మరలా టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాతే రాష్ట్ర భవిష్యత్ బాగుపడుతుందని క్లష్టర్ ఇన్‌చార్జ్ కణితి సురేష్ అన్నారు. సోమవారం బెండికొండ వద్ద పంచాయతీ పార్టీ నేతలు, కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో టీడీపీ-జనసేన కూటమి అధికారం వస్తుందన్నారు. కార్యక్రమంలో కూన షణ్ముఖరావు, హనుమంతు గిరిధర్, దాసరా దాశరధి, శిష్టు సారధి నాయుడు పాల్గొన్నారు.

వైసీపీ అరాచక పాలనకు అంతం పలకాలి

జలుమూరు (సారవకోట): వైసీపీ అరాచక పాలనకు అంతం పలికేందుకు ప్రజలు సిద్ధంగా ఉండాలని టీడీపీ మండల అధ్యక్షుడు కత్తిరి వెంకటరమణ అన్నారు. కోదడ్డపనస గ్రామంలో సోమవారం బాబు ష్యూరిటీ, భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. వైసీపీ చేసిన దోపిడీ, దౌర్జన్యాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో నాయకులు సురవరపు తిరుపతిరావు, పిళ్లా నందకిశోర్, పట్ట ఉమా, తాడేల భీమారావు, డి.జయరాం తదితరులు పాల్గొన్నారు.



కోదడ్డపనసలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

పాఠశాల ప్రాంగణంలో మొక్కల పెంపకం

బెలమర(పోలాకి): బెలమర ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో సోమవారం పలురకాల మొక్కలు నాటారు. విద్యా కమిటీ ఛైర్మన్ చింతు షణ్ముఖరావు, మాజీ సర్పంచ్ చింతు రామారావు, చింతు రాఘవరావు, మొక్కలునాటారు. నూతన సంవత్సరం సందర్భంగా వీటిని నాటామని ఉపాధ్యాయులు, విద్యార్థులు వీటిని పరిరక్షించాలని కోరారు. అనంతరం విద్యార్థుల తల్లిదండ్రుల సమీక్షా సమావేశం నిర్వహిచి పాఠశాలలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై చర్చించారు.

జనసేన నేతల సాయం

వజ్రపుకొత్తూరు: డోకులపాడు గ్రామానికి చెందిన ఉప్పాడ కారమ్మ అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న స్థానిక జనసేన నాయకులు సోమవారం రూ. 10 వేలు సాయం అందించారు. కార్యక్రమంలో లండ గిరిబాబు, మడ్డు యుగంధర్, రామకృష్ణ పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోండి

వజ్రపుకొత్తూరు: కేంద్రప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకో వాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కొర్రాయి బాలకృష్ణ అన్నారు. సోమవారం గోవిదంపురంలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం నిర్వహించారు. సమావేశంలో ఎంపీడీవో ఈశ్వరమ్మ, ఏపీఎం కె.జాంబవతి, ఏపీవో పి.కేశవరావు తదితరులు పాల్గొన్నారు.


ఇచ్ఛాపురం: నినాదాలు చేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది


నరసన్నపేట: నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు


ఆమదాలవలస: నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీ కార్యకర్తలు


గార: కల్లివలస ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద..

కొనసాగుతున్న అంగన్‌వాడీల నిరసన

తమ సమస్యల పరిష్కారం కోరుతూ అంగన్‌వాడీ సిబ్బంది, కార్యకర్తలు చేపట్టిన నిరసన సోమవారం కూడా కొనసాగింది. గత 21 రోజులుగా జిల్లా వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడుతున్నారు. వివిధ రూపాల్లో ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడంపై వారంతా మండిపడుతున్నారు. కొన్నిచోట్ల వివిధ రాజకీయ పార్టీల నాయకులు సంఘీభావం తెలిపారు. తమ సమస్యలు పరిష్కరించే వరకు ఆందోళన కొనసాగిస్తామని హెచ్చరించారు.

- ఆంధ్రజ్యోతి బృందం


ఎచ్చెర్ల: నిరసనలో పాల్గొన్న అంగన్‌వాడీలు


ఆమదాలవలస: సంఘీభావం తెలుపుతున్న రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిటీ సభ్యుడు గొండు సీతారాం


పలాసరూరల్: కాశీబుగ్గలో అంగన్‌వాడీ కార్యకర్తల ధర్నా


మందస: నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు


కోటబొమ్మాళి: నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీ సిబ్బంది


టెక్కలి రూరల్: టెక్కలిలో కబడ్డీ ఆడుతూ నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు


జలుమూరు: సారవకోటలో అంగన్‌వాడీల ధర్నా


కొత్తూరు: మోకాళ్లపై నిల్చొని నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు


పాతపట్నం: శిబిరంలో నినాదాలు చేస్తున్న అంగన్‌వాడీలు

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు దుర్మరణం

జిల్లాలో సోమవారం జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందారు. ఎచ్చెర్ల మండలం కేశవరావుపేటకు చెందిన ఆటో డ్రైవర్, టెక్కలి మండలం కె.కొత్తూరు గ్రామానికి చెందిన తాపీమేస్త్రి దుర్మరణం చెందారు.

ఫరీద్‌పేట సమీపంలో ఆటో డ్రైవర్..


లక్ష్మణరావు(ఫైల్)

ఎచ్చెర్ల: ఫరీద్‌పేట జంక్షన్‌కు సమీపాన జాతీయ రహదారిపై సోమవారం జరిగిన ప్రమాదంలో ఆటోడ్రైవర్ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఇదే మండలం కేశవరావుపేట గ్రామానికి చెందిన పేడాడ లక్ష్మణరావు (27) ఆటో నడుపుతూ శ్రీకాకుళం వైపు వెళ్తుండగా ముందు రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని ఢీకొట్టడంతో.. తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ లారీపైన ఉంచిన ప్రొక్లెయినర్ బలంగా ఢీకొనడంతో.. ఆటో డ్రైవర్ చిక్కుకున్నాడు. స్థానికులు ప్రమాదాన్ని గమనించి సుమారు అరగంట సేపు శ్రమించి అతికష్టమ్మీద బయటకు తీశారు. లక్ష్మణరావుకి తల్లిదండ్రులు అప్పలనాయుడు, గోదావరి, సోదరుడు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

కె.కొత్తూరు వద్ద తాపీమేస్త్రి..


గంగయ్య(ఫైల్)

టెక్కలి రూరల్: కె.కొత్తూరు జాతీయ రహదారిపై సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో అదే గ్రామానికి చెందిన పానిల గంగయ్య (34) మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. తాపీమేస్త్రిగా జీవనం సాగిస్తున్న గంగయ్య సోమవారం సాయంత్రం టెక్కలి నుంచి ద్విచక్రవాహనంపై గ్రామానికి వ స్తుండగా, కె.కొత్తూరు సర్వీసు రోడ్డు సమీపంలో బైక్ పంక్చర్ కావడంతో ఒక్కసారిగా అదుపుతప్పి కింద పడిపోవడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే గ్రామస్థులు హుటాహుటిన చికిత్స నిమిత్తం టెక్కలి జిల్లా ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమించడంతో 108 వాహనంలో శ్రీకాకుళం తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. గంగయ్యకు భార్య సుజాత, కుమారులు చరణ్, అజయ్ ఉన్నారు. ఘటనపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ-2 కె.రమేష్‌బాబు తెలిపారు.

అమెరికా కరెన్సీ చూపి.. సొమ్ము దోచుకుని..

- కవిటి కొత్తూరు పెట్రోల్ బంకులో రూ.12,500తో పరారీ

కవిటి: కవిటి పంచాయతీ పరిధిలోని కవిటికొత్తూరులో ఉన్న పెట్రోల్‌బంకులో ఆదివారం ఓ వ్యక్తి సొమ్ముదోచుకున్నాడని ఫిర్యాదు అందిందని ఏఎస్సీ కూర్మారావు తెలిపారు. ఏఎస్సీ కథనం మేరకు.. బంకులో పనిచేస్తున్న జి.శ్రీనివాసరావు వాహనాలకు పెట్రోల్ కొడుతున్నాడు. ఆ సమయంలో వాహనచోదకులు ఇచ్చిన సొమ్మును చేతిలో పట్టుకుని పనిచేస్తున్నాడు. ఆదివారం సాయంత్రం గుర్తుతెలియని వ్యక్తి వచ్చి అమెరికా కరెన్సీ మార్పు చేసి పెట్రోల్ వేయమన్నాడు. ఇక్కడ కరెన్సీ మార్పునకు కుదరదని విధులు నిర్వహిస్తున్న శ్రీనివాసరావు చెప్పాడు. ఇంతలో రెప్పపాటులో ఆయన చేతిలో ఉన్న రూ. 12,500 బలవంతంగా లాక్కొని వాహనంపై పరారయ్యాడు. శ్రీనివాసరావు ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేశారు.

బొల్లినేని మెడ్‌స్కిల్స్‌లో బీఎస్సీ పారా మెడికల్ నూతన కోర్సులు


నాగేశ్వరరావుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న సిబ్బంది

శ్రీకాకుళం, జనవరి 1(ఆంధ్రజ్యోతి): బొల్లినేని మెడ్‌స్కిల్స్ (జెమ్స్) లో నూతనంగా నా లుగు బీఎస్సీ పారా మెడికల్ కోర్సులు ప్రారంభిస్తున్నామ ని ఆ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వర రావు అన్నారు. సోమవారం కళాశాల ఎనిమిదో వార్షికోత్స వం సందర్భంగా తొలుత సిబ్బంది, విద్యార్థుల సమక్షంలో కేక్‌ను కట్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో తమ కళాశాలలో మాత్రమే ఈ కోర్సులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. బీఎస్సీ ట్రాన్స్ఫ్యూషన్ టెక్నాలజీ కోర్సులో ఐదు సీట్లు, రేడియో థెరపీ టెక్నాలజీ కోర్సులో రెండు సీట్లు, ఫిజీషియన్ అసిస్టెంట్ టెక్నాలజీ కోర్సులో 15 సీట్లు, మెడికల్ రికార్డ్సు టెక్నాలజీ కోర్సులో ఐదు సీట్లు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ఈ కోర్సుల్లో చేరేందుకు ఇంటర్ బైపీసీ పూర్తి చేసిన వా రు అర్హులని తెలిపారు. పూర్తి వివరాల కోసం 76809 45357, 91219 99654 ఫోన్ నెంబర్లులో గాని, శ్రీకాకుళం సమీపంలో రాగోలులో జెమ్స్ ఆసుపత్రిలో గల క్యాంపస్‌లో సంప్రదించాలని కోరారు.

ఎటు చూసినా చెత్తే..

- శ్రీకాకుళంలో అధ్వానంగా పారిశుధ్యం
- పెద్దమార్కెట్‌లో అడుగుపెట్టలేని పరిస్థితి

శ్రీకాకుళం క్రైం: మునిసిపల్ కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికుల సమ్మెతో జిల్లా కేంద్రం శ్రీకాకుళం కంపుకొడుతుంది. నగరంలో ఎటుచూసినా చెత్తే కుప్పలే దర్శనమిస్తున్నాయి. చెత్త సేకరించే కార్మికుడే కరువయ్యాడు. పెద్దమార్కెట్‌లో పారిశుధ్య పరిస్థితి మరింత అధ్వానంగా తయారైంది. కూరగాయల వ్యర్థాలను వ్యాపారస్తులు మార్కెట్ ఆవరణలోనే పడేస్తున్నారు. దీంతో మార్కెట్‌లో అడుగుపెట్టాలంటేనే భయపడే పరిస్థితి ఏర్పడింది. శ్రీకాకుళం నగరపాలక సంస్థలో సుమారు 70 మంది పర్మినెంట్ కార్మికులు ఉన్నప్పటికీ చెత్త సేకరణ పూర్తిస్థాయిలో చేపట్టడం లేదు. ఆదివారం ఇంటింటికీ చెత్త సేకరించే వాహనాలను తీసుకెళ్లి ప్రజలే వ్యాన్ దగ్గరకు వచ్చి చెత్త వేయాలని కోరారు. కాగా రెండు రోజులు కిందట నగరంలోని తుమ్మా వీధిలో మంత్రి ధర్మాన ప్రసాద రావు రోడ్డు పనుల శంకుస్థాపనకు వస్తున్నారని తెలియడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ఐదుగురు పారిశుధ్య కార్మికులను నియమించి యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టడంపై ప్రజలు విమర్శలు గుప్పిస్తున్నారు. తమ నివాసాల్లో చెత్తను వదిలేసి ప్రజా ప్రతినిధుల మన్ననల కోసం అధికారులు పాకులాడటం తగదని మండిప డుతున్నారు. ఇప్పటికైనా అన్నిచోట్ల చెత్తను తొల గించాలని కోరుతున్నారు.


పెద్ద మార్కెట్‌లో పేరుకుపోయిన చెత్త


ఆమదాలవలస రైల్వేస్టేషన్ వద్ద..

సిబ్బంది సమ్మె.. వీధుల్లో చెత్త

ఆమదాలవలస: మునిసిపల్ పారిశుధ్య కార్మికులు సమ్మె వల్ల వీధుల్లో చెత్త పేరుకుపోతోంది. తమ సమస్యల పరిష్కారంకోసం సిబ్బంది ఏడు రోజులుగా సమ్మెచేస్తున్నారు. ఈ నేపథ్యంలో మునిసిపల్ అధికారులు వార్డుల్లో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయలేదని పలువురు వాపోతున్నారు. దీంతో పట్టణంలోని పలు వీధులతో పాటు ప్రధాన రహదారుల పక్కన కూడా చెత్త పేరుకుపోయింది.


ఆమదాలవలస: మోకాళ్లపై నిరసన తెలుపుతున్న పారిశుధ్య కార్మికులు


ఇచ్ఛాపురం: సమ్మెలో పాల్గొన్న పారిశుధ్య కార్మికులు

మోకాళ్లపై పారిశుధ్య కార్మికుల నిరసన

ఆమదాలవలస: మునిసిపల్ పారిశుధ్య కార్మికుల సమ్మె సోమవారం ఏడోరోజుకు చేరింది.ఈ మేరకు ఆమదాలవలస మునిసిపల్ షాపింగ్ కాంప్లెక్స్ వద్ద పారిశుధ్య కార్మికులు మోకాళ్లపై నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో పారిశుధ్య కార్మికుల సంఘ అధ్యక్షుడు సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

- **ఇచ్ఛాపురం:** పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించేంత వరకు పోరాటం చేస్తామని సీఐటీయూ జిల్లా నాయకులు అన్నారు. సోమవారం మున్సిపల్ కార్యాలయం ఎదురుగా ఆందోళన చేశారు. ప్రభుత్వం స్పందించక పోవడం దారుణని సీఐటీయూ నాయకులు రమేష్ పట్నాయక్ అన్నారు.

సర్పంచ్‌ల సదస్సుకు తరలిరండి


మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

జి.సిగడాం: మంగళగిరిలో ఈ నెల 3న నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి సర్పంచ్‌ల సదస్సులకు తరలిరావాలని ఆ సంఘం కార్యదర్శి బోగాది అప్పలనాయుడు పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏపీ పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర అధ్యక్షుడు, సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వైవీబీ రాజేంద్ర ప్రసాద్, వానపల్లి లక్ష్మీ అధ్యక్షతన నిర్వహించనున్న ఈ సదస్సుకు రాజకీయాలకు అతీతంగా అన్ని పార్టీల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, కౌన్సిలర్‌లు, కార్పొరేటర్‌లు హాజరుకావాలని కోరారు.

లారీ డ్రైవర్ల నిరసన


రహదారిపై నిరసన తెలుపుతున్న లారీ డ్రైవర్లు

సోంపేట: కేంద్రప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా లారీ డ్రైవర్లు కొర్లాం వద్ద జాతీయ రహదారిపై సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన చట్టాన్ని వెనక్కు తీసుకోవాలని కోరారు. జాతీయ రహదారిపై ప్రమాదం జరిగి ప్రాణనష్టం జరిగితే రూ.10లక్షలు జరిమానా, జైలుశిక్ష విధిస్తూ కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని డిమాండ్‌చేశారు. కాగా డ్రైవర్ల నిరసనతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది.



ఇచ్ఛాపురం రూరల్: లక్ష్మీపురం తీరంలో పర్యాటకుల సందడి


సోంపేట: బారువ బీచ్‌లో పర్యాటకులు..

తీరంలో సందడే.. సందడి

ఇచ్ఛాపురం రూరల్: తీర ప్రాంతంలో న్యూఇయర్ పురస్కరించుకుని సోమవారం పర్యాటకులు సందడిచేశారు. ఒడిశా సరిహద్దు తీరంలోగల సొన్నాపురం, లక్ష్మీపురం, డొంకూరులో సందర్శకుల తాకిడి అధికంగా కనిపించింది. చాలామంది కుటుంబాలతో వచ్చి సరుగుడు తోటల్లో భోజనాలు చేసి సముద్ర తీరంలో సేదదీరారు.

ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా అడ్డయ్య


బాధ్యతలు చేపట్టిన అడ్డయ్య

ఎచ్చెర్ల: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా బిడ్డిక అడ్డయ్య సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు రిజిస్ట్రార్‌గా పని చేసిన సీహెచ్ఏ రాజేంద్రప్రసాద్ రెండేళ్ల పదవీ కాలం ముగియడంతో తన మాతృసంస్థ ద్రావిడ యూనివర్సిటీ (కుప్పం)కు తిరిగి వెళ్లిపోయారు.

రుణాలపై అవగాహన

గార: బందరువానిపేటలో సోమవారం సాయంత్రం కేంద్ర ప్రభుత్వ వికసిత భారత సంకల్ప యాత్రలో భాగంగా జరిగిన కార్యక్రమంలో స్థానిక మత్స్యకారులకు కేసీసీ రుణాలు ఏవిధంగా పొందాలి, వాటి ప్రయోజనం మొదలైన అంశాలపై ఫిషరీష్ ఎఫ్‌డీవో బగాది సురేష్ కుమార్ వివరించారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు జీవీఏ ప్రసాద్, ఎంఆర్ కొంకణ్, సర్పంచ్, మత్స్యకారులు సంఘం అధ్యక్షుడు పెద్దలు పాల్గొన్నారు.

దామోదర్ కుటుంబానికి పరిహారం ఇవ్వాలి

లావేరు: జగన్ పత్రికలో విలేకరిగా పనిచేస్తూ ఆత్మహత్య చేసుకున్న కేశవరాయపురం గ్రామానికి చెందిన జి.దామోదరరావు కుటుంబాన్ని మానవ హక్కుల సంఘం స్టేట్ సివిల్ రైట్స్ చైర్మన్ కరణం తిరుపతినాయుడు సోమవారం పరామర్శించారు. ఇతడి ఆత్మహత్య వెనుక కుట్ర కోణం ఉందని, దీనిపై పోలీసులు సమగ్రంగా దర్యాప్తు చేయాలన్నారు. దామోదర్ మృతి వెనుక వైసీపీ నేతల ప్రమేయం ఉందని, మానసిక వేధింపుల తోనే ఆత్మహత్యకు పాల్పడినట్టు ఆరోపించారు. కేసు దర్యాప్తులో పోలీసులు ఘోరంగా విఫలమయ్యారని, మృతుని కుటుంబానికి నష్టపరిహారం అందించాలన్నారు.

సచివాలయం ప్రారంభం

ఆమదాలవలస: మండలంలోని చింతలపేటలో నిర్మించిన గ్రామ సచివాలయం, వైఎస్ఆర్ ఆరోగ్య కేంద్రం స్పీకర్ తమ్మినేని సీతారాం సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు పేడాడ రమణ, పేడాడ ముకుందరా వు,సేపాన గోవిందరావు, పేడాడ శశిభూషణరావు పాల్గొన్నారు.

నల్గొండ జిల్లాలో పోలాకి మండల వాసుల ఆత్మహత్య

పోలాకి: తెలంగాణ రాష్ట్రం నల్గొండ జిల్లా మిర్యాలగూడ రైల్వేస్టేషన్ ట్రాక్ వద్ద పోలాకి మండలానికి చెందిన యువజంట ఆత్మహత్యకు పాల్పడినట్టు స్థానిక పోలీసులకు సోమవారం సమాచారం అందింది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. పోలాకి మండలం తలసముద్రం గ్రామానికి చెందిన వివాహిత, మబగాం గ్రామానికి చెందిన యువకుడు రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నారు. మృతురాలు నరసన్నపేటలోని ఓ వస్త్ర దుకాణంలో పని చేస్తుండేదని, ఇద్దరు పిల్లలు ఉన్నారన్నారు. ఆమెతో మృతుడికి వివాహేతర సంబంధం ఏర్పడి గత నాలుగు రోజుల నుంచి వీరిరువురూ కనిపించలేదని సమాచారం. ఈ విషయమై కుటుంబసభ్యులు పోలీసులకు సమాచారం ఇవ్వలేదని తెలిసింది. వారు మిర్యాలగూడలో ఆత్మహత్యకు పాల్పడడంతో రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి పోలాకి పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు పోలీసులు తెలిపారు. యువ జంట ఆత్మహత్యకు పాల్పడ్డారని తెలియగానే ఆయా గ్రామస్థులు విషాదం నెలకొంది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ధాన్యం బస్తాలతో ఆందోళన



ఇచ్ఛాపురం: బెల్లుపడ ఆర్బీకేవద్ద ధాన్యం బస్తాలతో సోమవారం రైతులు ఆందోళనకుదిగారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ధాన్యాన్ని మిల్లర్లు సకా లంలో తీసుకోకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. ట్రాక్టర్లతో ధాన్యాన్ని మిల్లర్ల వద్దకు తీసుకెళ్లినా తీసుకోవడంలేదని తెలి పారు. మూడు రోజులుగా ధాన్యం బస్తాలు నిలిచి పోయి ఉన్నాయని, రైతులు ధాన్యం బస్తాలతో ఆందోళన చేశారు. మండలానికి ఒక్క మిల్లు కేటాయించడం, అది కూడా రోజుకు 100 టన్నులకు అనుమతి ఉందని తీసుకోవడం లేదని తెలిపారు.